రక్షణ కల్పించాలి



అన్ని రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు రక్షణ కల్పించాలి. మహిళా డాక్టర్లకు మాత్రమే కాకుండా ఎక్కడ మహిళలు పనిచేస్తున్నా వారికి భద్రత ఉంటే ధైర్యంగా వారి పనులు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే నినాదాలు ఉన్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. మహిళా డాక్టర్లకు సరైన వసతులు కల్పించాలి.

– డాక్టర్ కిరణ్‌రిషిత, కో–లొకేటెడ్ పీహెచ్‌సీ, పొదలకూరు

మహిళలు తలెత్తుకుని తిరగాలి



రాత్రివేళల్లో సైతం మహిళలు తలెత్తుకుని తిరగాలి. కోల్‌కతా ఘటన అమానవీయం. ఇలాంటి ఘటనల వల్ల మహిళా డాక్టర్ల ధైర్యం సన్నగిల్లుతోంది. నైట్ డ్యూటీలు చేసే మహిళా డాక్టర్లకు రక్షణ కరువైతే విధులకు హాజరు కాలేరు. వారికి అన్ని విధాలుగా రక్షణతో పాటు సౌకర్యాలు కల్పించాలి. లేదంటే పగటి వేళల్లో విధులు నిర్వహించేలా చూడాలి.

– డాక్టర్ శ్రీకావ్య, కో–లొకేటెడ్ పీహెచ్‌సీ, పొదలకూరు

వైద్యుల రక్షణ ప్రభుత్వ బాధ్యత



ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది రక్షణను ప్రభుత్వమే బాధ్యతగా తీసుకోవాలి. ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలు మాలో భయాందోళనలు కలిగిస్తున్నాయి. డాక్టర్లంటే దేవుళ్లుగా భావించే మన దేశంలో ఇలాంటి దారుణాలు జరగడం బాధాకరం. మాకు కుటుంబాలు ఉంటాయన్న విషయాన్ని అందరూ గుర్తెరగాలి. ప్రభుత్వం మాకు రక్షణ కల్పించాలి.

– డాక్టర్ అనూష, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, ఆత్మకూరు



క్లుప్తంగా

పిచ్చిమొక్కలకు ఆవాసంగా జగ్జీవన్‌రామ్ భవన్



పొదలకూరు : పట్టణానికి సమీపంలో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ భవన్ పిచ్చిమొక్కలకు ఆవాసంగా మారింది. చాలాకాలంగా భవనాన్ని ఉపయోగించకపోవడంతో అపరిశుభ్రంగా మారింది. జగ్జీవన్‌రామ్ జయంతి, వర్ధంతి నాడు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి వెళ్తుంటారు. తర్వాత దీనిని వినియోగించకపోవడంతో భవన ప్రాంగణం, చుట్టుపక్కల పిచ్చి మొక్కలు మొలిచాయి. పక్కనే ఉన్న జ్యోతిరావు పూలే భవనం పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఈ భవనాలకు కమిటీలు ఉన్నా ఇటీవల పట్టించుకోకపోవడం వల్లనే దుస్థితికి చేరుకుంటున్నట్లు తెలుస్తోంది.

నృసింహుడి సేవలో జడ్జి



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవారిని జిల్లా ఫస్ట్ అడిషనల్ జడ్జి గీత తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయాధికారులు, అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. తీర్థప్రసాదాలను అందజేశారు. ఇన్‌చార్జి ఈఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి కృష్ణాష్టమి వేడుకలు


నెల్లూరు(బృందావనం): రాజేంద్రనగర్‌లోని మురళీకృష్ణ దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలను మంగళవారం నుంచి సెప్టెంబర్ ఐదు వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవస్థాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్రహ్మణ్యం ఆచారి, మోహన్ ఆచారి తదితరులు ప్రకటనను ఆదివారం విడుదల చేశారు.

రంగస్థల నటుడికి సత్కారం



నెల్లూరు(బృందావనం): సామాజిక, కళా తదితర రంగాల్లో విశిష్టసేవలందిస్తున్న పలువుర్ని నగరంలోని టౌన్‌హాల్లో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా పౌరాణిక రంగస్థల నటుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పణతుల వెంకటరమణయ్యను విద్యారత్న బిరుదుతో సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గోవర్ధన్, జయచంద్ర, నలుబోలు బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ విలువలను అందించడంలో ఎంతో కృషి



రామకృష్ణప్రసాద్‌రావును సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): భారతీయ సాహిత్య విలువలను భావితరాలకు అందించాలనే కాంక్ష పోలూరి హనుమజ్జానకీరామశర్మలో మెండుగా ఉందని, ఇందులో యువతను భాగస్వామ్యం చేసేందుకు ఎంతో పరితపించారని ఉపన్యాసకుడు సింగరాజు రామకృష్ణ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఆంధ్ర వాల్మీకి హనుమజ్జానకీరామశర్మ శత జయంత్యుత్సవాల్లో భాగంగా పదో సమావేశాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణప్రసాద్‌రావును సత్కరించారు. కథా తరంగిణి గ్రంథాన్ని సభ్యులకు అందజేశారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, కార్యదర్శి చీమకుర్తి వెంకటేశ్వరరావు, కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, నిర్వాహకులు వేదం రాధాకృష్ణమూర్తి, శ్రీరామ్మూర్తి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కేంద్రాలకు నిర్వహణ గ్రహణం

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు నిర్వహణ గ్రహణం పట్టి చెత్త కేంద్రాలుగా మిగిలిపోయాయి. నిర్మించిన అన్ని కేంద్రాలు నిరుపయోగంగా మారి దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. వీటి నిర్మాణానికి వెచ్చించిన రూ.లక్షల నిధులు బూడిదలో పోసిన పన్నీరైంది. వీటిని వినియోగంలోకి తెచ్చి సంపద సృష్టిస్తే పంచాయతీలకు ఆదాయ వనరుగా మారుతాయి. కానీ ప్రభుత్వం ఆ దిశగా యత్నించడం లేదు. నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా ఉంటే కొత్త కేంద్రాలకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. ఉన్న కేంద్రాల్లో సంపద సృష్టించాకే కొత్త వాటిని నిర్మించాలే కానీ ఆ కేంద్రాలను గాలికొదిలేసి కొత్త వాటి నిర్మాణాలేమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

- సంపద సృష్టి వట్టిదే
- కేంద్రాలన్నీ నిరుపయోగమే
- రూ.లక్షల నిధులు బూడిదలో పోసిన పన్నీరే



కొడవలూరులో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం, మెషీన్లు

కొడవలూరు మండల పరిధిలో..	
గ్రామ పంచాయతీలు	24
నిర్మించిన సంపద కేంద్రాలు	11
నిరుపయోగంగా ఉన్నవి	11
పూర్తయిన పెద్ద కేంద్రాలు	03
పూర్తయిన చిన్న కేంద్రాలు	08
పెద్ద కేంద్రం నిర్మాణానికి	రూ.5.60 లక్షలు
చిన్న కేంద్రం నిర్మాణానికి	రూ.2.25 లక్షలు

కొడవలూరు : చెత్త నుంచి సంపద తయారీకి తొలుత తడి, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేయాలి. తదుపరి పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌ల ద్వారా చెత్త నుంచి సంపద కేంద్రానికి తరలించాలి. పొడి చెత్తగా పిలవబడే ప్లాస్టిక్‌ను విక్రయించడం ద్వారా లాభం ఆర్జించాలి. తడి చెత్తను ఉపయోగించి సేంద్రియ ఎరువులను తయారు చేసి విక్రయించాలి. గాజు, రబ్బరు వస్తువులను మెషీన్ ద్వారా ఆడించి ముక్కలుగా మార్చి మరో యంత్రం ద్వారా దగ్ధం చేయాలి. ఇందుకోసం ప్రతి కేంద్రం వద్ద రెండు యంత్రాలను అందుబాటులో ఉంచాలి. కొడవలూరు కేంద్రానికి రెండు యంత్రాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అవసరం కావడంతో జాప్యం జరిగి నిరుపయోగంగా ఉండిపోయాయి. ప్లాస్టిక్ వస్తువులు, సేంద్రియ ఎరువులు విక్రయించడం ద్వారా వచ్చే లాభంతో పంచాయతీలు పరిపుష్టి చెందాలన్నది ప్రధాన లక్ష్యం కాగా, గ్రామాల్లో ఎక్కడ బడితే అక్కడ చెత్తా చెదారాలు లేకుండా పరిశుభ్ర గ్రామాలుగా మార్చాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. కానీ లక్ష్యం నీరు గారి అన్నీ కేంద్రాలు నిరుపయోగంగా ఉండిపోయాయి.

ఆరంభ శూరత్వమే

ఈ సంపద కేంద్రాలను నిర్మించిన ఆరంభంలో సంబంధిత గ్రామాల్లో ఇంటి వద్దనే తడి, పొడి చెత్తలను వేరు చేసేలా డస్ట్ బిన్‌లను కూడా ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. ఈ డస్ట్ బిన్‌లను గ్రీన్ అంబాసిడర్‌లు ఇంటికే వచ్చి తీసుకుపోయి కేంద్రానికి చేర్చాలి. కానీ గ్రీన్ అంబాసిడర్‌లకు నెలసరి వేతనం కేవలం రూ.6 వేలు కావడం, ఆ వేతనాలు కూడా ఆరు నెలలకు లేక ఏడాదికి ఇస్తుండడంతో ఏ ఒక్కరూ ఈ విధులు నిర్వహించేందుకు ముందుకు రాలేదు. ఇతరత్రా పనులకు వెళ్తే రోజుకు రూ.500 లకు పైగా కూలి వస్తుండడంతో అటు వైపు మొగ్గు చూపుతున్నారు. రోజువారీ కూలీ ఇచ్చి కొందరిని తీసుకొచ్చి కొద్ది రోజులు పనులు చేయించినా పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా ఎక్కువ కాలం కొనసాగించలేకపోయారు. పలు కేంద్రాల్లో తొట్టెలు నిర్మించి సేంద్రియ ఎరువులైన వాన పాముల ఎరువును తయారు చేశారు. తయారీకి కూలీల ఖర్చు గణనీయంగా పెరగడం, వాన పాముల ఎరువు సకాలంలో అమ్ముడుకాకపోవడంతో నష్టదాయకంగా మారింది. దీంతో అన్ని కేంద్రాల్లోనూ ఎరువుల తయారీని నిలిపి వేశారు. ప్రస్తుతం అన్ని కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

సంపద సృష్టి లేకుండానే కొత్తవి మంజూరట

ఇప్పటికే ఉన్న చెత్తతో సంపద కేంద్రాల్లో ఎలాంటి సంపద సృష్టి లేక నిరుపయోగంగా వదిలేసి ఉన్నారు. వాటి నిర్మాణానికి వెచ్చించిన రూ.కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. వీటి పరిస్థితి ఇలా ఉంటే కొత్త కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా మారింది. ఉన్న వాటిని వినియోగంలోకి తెచ్చి సంపద సృష్టి జరిగాకే కొత్తవి నిర్మిస్తే బాగుంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కొత్త వాటికి నిధులు మంజూరు చేస్తామన్నారు



మండలంలోని 24 పంచాయతీలకు గానూ 13 పంచాయతీల్లో తొలి విడతలో చెత్త నుంచి సంపద కేంద్రాలకు నిధులు మంజూరు చేశారు. వీటిలో రేగడిచెలిక, కమ్మపాళెంలలో స్థల సమస్య కారణంగా నిర్మాణాలు జరగలేదు. మిగిలిన 11 పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇప్పుడు మిగిలి ఉన్న 13 పంచాయతీల్లో కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. పాత కేంద్రాలతో పాటు కొత్త కేంద్రాలను కూడా వినియోగంలోకి తేవాలన్నది ప్రభుత్వ యోచన. పాత కేంద్రాలకు కూడా అవసరమైన నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తేవడంతో పాటు కొత్త కేంద్రాలకు నిధులు మంజూరు చేస్తారని భావిస్తున్నాం. ఇది సాకారమైతే పంచాయతీలకు లాభదాయకంగా ఉంటుంది.

– పి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ, కొడవలూరు



బసవాయపాళెంలో వినియోగంలో లేక పిచ్చిచెట్లకు ఆవాసంగా మారిన కేంద్రం



యల్లాయపాళెంలో దిష్టిబొమ్మలా మారిన చెత్త సంపద కేంద్రం



అందంగా తీర్చిదిద్దినా నిరుపయోగమైన గౌతమ్‌నగర్ కేంద్రం

సేవా కార్యక్రమాలతో ఎనలేని సంతృప్తి



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న నైనా ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుహాసిని

వెంకటాచలం : సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా ఎనలేని సంతృప్తి ఉంటుందని నైనా ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఎన్సీ సుహాసిని పేర్కొన్నారు. వెంకటాచలంలో డాక్టర్ బెంజిమిన్ ఐజిక్ జన్మదినం సందర్భంగా నైనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, దుస్తులు పంపిణీ కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్సీ సుహాసిని మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా జిల్లాలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా పేదలకు అన్నదానం, నిత్యావసరాల పంపిణీ, దుస్తులను పంపిణీ చేయడంలో చాలా సంతృప్తిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సైమన్ సాహిత్, అబ్రహం, సునీతమ్మ, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



మనుబోలు : నమూనా చెక్కును ప్రదర్శిస్తున్న అధికారులు



కొడవలూరు : పొదుపు మహిళలకు సామాజిక పెట్టుబడి నిధి చెక్కుల అందజేత

మనుబోలు : మహిళలు సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గుండాల వజ్రమ్మ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో లాఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పొదుపు మహిళలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని టీవీల ద్వారా వీక్షించారు. మండలంలో 195 మంది మహిళలకు రూ.1.02 కోట్ల రుణాలకు సంబంధించిన నమూనా చెక్కును అందజేశారు. అనంతరం ఏపీఎం వనజాక్షి మాట్లాడుతూ ప్రతి మహిళకు రూ.50 వేల వరకు సబ్సిడీతో రుణం ఇస్తామని తెలిపారు. రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీసీ దేవమ్మ, జయమ్మ, రాజేశ్వరి, ధనమ్మ, శ్రీనివాసులు, అకౌంటెంట్ పార్వతి, టీడీపీ నాయకులు దండు చంద్రశేఖర్‌రెడ్డి, నూనె లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యం

కొడవలూరు : పొదుపు మహిళలను లక్షాధికారులను చేసి ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ మండలాధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. కొడవలూరు సంఘ బంధం కార్యాలయంలో 'లాఖ్‌పతి దీదీ' కార్యక్రమం టెలీకాస్ట్‌ను ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పొదుపు మహిళల స్వయం ఉపాధులకు మంజూరు చేసిన సామాజిక పెట్టుబడి నిధి రూ.10 లక్షలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలంతా లక్షాధికారులు కావాలన్నదే ప్రధాన మంత్రి మోదీ ధ్యేయమన్నారు. ప్రతి మహిళ నెలకు రూ.10 వేలకు తగ్గకుండా ఆదాయం ఆర్జించడం ద్వారా లక్షాధికారులు కావాలన్నారు. కొత్త జీవనోపాధులు ఎంచుకోవడం ద్వారా పొదుపు మహిళలు ఆదాయ మార్గాలను పెంచుకోవాలన్నారు. ఏ మహిళ పేదరాలిగా ఉండకూడదన్నదే ప్రధాన మంత్రి లక్ష్యమని చెప్పారు. మహిళల జీవనోపాధులకు కేంద్రం ప్రోత్సాహిస్తున్నందున సద్వినియోగం చేసుకుని పేదరికాన్ని దూరం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.రుక్మిణి, సంఘ మిత్ర అధ్యక్ష, కోశాధికారులు దానం పుష్ప, ప్రవీణ, సీసీలు కె.ఉదయ్‌కుమార్, మమత, శోభ, శ్రీదేవి, సుకన్య పాల్గొన్నారు.

నేటి అర్జీల స్వీకరణ రద్దు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాష్టమిని పురస్కరించుకొని సెలవు కావడంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని చెప్పారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో ఆదివారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన ఫయాజ్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో ఫయాజ్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని ఆదివారం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆనం జయకుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని అభిమానుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. జయ, లెనిన్, గౌస్, చంద్రశేఖర్, మహ్మద్, ఆయాజ్, శివారెడ్డి పాల్గొన్నారు.

వీరంపల్లిలో ఉచిత వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ హారికారెడ్డి

మనుబోలు : మండలంలోని వీరంపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గూడూరుకు చెందిన కేవీ హాస్పిటల్, హారిక కంటి వైద్యశాల సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరంలో వీరంపల్లి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో గైనకాలజిస్ట్ డాక్టర్ కె.కీర్తి, కంటి వైద్యురాలు మల్లెమాల హారికారెడ్డి, ఫిజీషియన్ డాక్టర్ లక్ష్మీనారాయణ, చిన్న పిల్లల వైద్యుడు త్రివిక్రమరావు రోగులను పరీక్షించారు. ఈ శిబిరాన్ని అల్లూరి రమేష్, పలగాని శ్రీనివాసులురెడ్డి, నూనె లక్ష్మయ్య, చెలికం కోటేశ్వరరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

కృష్ణ మందిరంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో కొలువైన కృష్ణుడికి వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రారంభించారు. సుప్రభాతసేవ, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, గో పూజ తదితరాలను మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. తదుపరి స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా లక్ష్మీనరసింహయాదవ్, పద్మ దంపతులు, మందిర ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శి సుబ్బారామరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు దశాబ్దాలుగా.. నిరుపయోగంగా..

- అభివృద్ధికి నోచుకోని మెయిన్ బస్‌స్టేషన్
- లోపలికి వెళ్లని బస్సు సర్వీసులు



ప్రయాణికులు లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్న బస్‌స్టేషన్

పొదలకూరు : రెండు దశాబ్దాలుగా పొదలకూరు ఆర్టీసీ బస్‌స్టేషన్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. బస్టాండ్ చుట్టుపక్కల స్థలాల విలువ విపరీతంగా పెరిగినా ఇక్కడ వ్యాపార సముదాయాలు అభివృద్ధి చెందడం లేదు. బస్సు సర్వీసులు రాకుండా బస్టాండ్ బీడుగా మారింది. గతంలో కలెక్టర్ చొరవతో బస్‌స్టేషన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఫలితంగా కొద్దిరోజులు బస్సులు బస్‌స్టేషన్ లోపలికి వెళ్లి వచ్చేవి. అయితే ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో చాలాకాలం దుకాణ సముదాయాలు ఏర్పడలేదు. ఇటీవల ఒకటి రెండు దుకాణాలను ఏర్పాటు చేసినా చెప్పుకునే స్థాయిలో వ్యాపారాలు జరగడం లేదంటున్నారు. అయితే ఇటీవల పది రోజుల పాటు బస్సు సర్వీసులు లోపలికి వెళ్లినా మళ్లీ నిలిపివేశారు. తిరిగి మళ్లీ లోపలికి వెళ్తా కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేసినా ఇది ఎంతకాలం ఉంటుందోనని చెప్పుకుంటున్నారు. 1996లో తెలుగుదేశం ప్రభుత్వంలో ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మాణం జరిగి అప్పటి రెవెన్యూశాఖ మంత్రి దేవేంద్రగౌడ్ బస్టాండ్‌ను ప్రారంభించారు. తర్వాత కొంతకాలం బస్టాండ్‌లో బస్సులు నిలబడినా తర్వాత నిరుపయోగంగా మారింది. అంతేకాక ఒకటి, రెండు దుకాణాలు అప్పట్లో ఏర్పాటు చేసినా ప్రయాణికులు బస్‌స్టేషన్‌లో బస్సులు దిగకపోవడం వల్ల దుకాణాలు మూతపడ్డాయి. తర్వాత చాలా ఏళ్ల బస్టాండ్ బీడుపడిపోయింది. ఏడాది క్రితం పట్టణంలో ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్, పంచాయతీ బస్టాండ్ ఆక్రమణలు తొలగిస్తే అక్కడి వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో దుకాణాలను కేటాయించేందుకు అధికారులు ప్రయత్నించారు. ఫలితంగా మరమ్మతులు చేపట్టి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. అంతేకాక దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు స్థలాలకు టెండర్లను సైతం పిలిచారు. అయితే ఆశించిన స్థాయిలో దుకాణాలను ఏర్పాటు చేసేందుకు స్థానికులు ముందుకు రాలేదు. కాగా పంచాయతీ బస్టాండ్‌కు బస్సు సర్వీసులు వచ్చి నిలబడుతుంటాయి. ఇక్కడ ప్రయాణికుల రద్దీ పెద్ద సంఖ్యలో ఉంటుంది. ఆర్టీసీ బస్టాండ్ పట్టణానికి దూరంగా ఉండడం వల్ల ప్రయాణికులు అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. అయితే నెల్లూరు, సంగం మార్గాలకు చెందిన ప్రయాణికులు ఆర్టీసీ బస్‌స్టేషన్ అనుకూలంగా ఉంటుందని అధికారులు అంటున్నారు.



రద్దీగా ఉన్న పంచాయతీ బస్టాండ్